
నమస్తే తెలంగాణ
# నాగర్‌కర్నూల్
3 | మహబూబ్‌నగర్, శనివారం 13 జనవరి 2024 | NAGARKURNOOL



అప్పాజిపల్లిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, (ఇన్‌సెట్లో) స్వామి మూల విరాట్

# నర్సన్న సేవకు వేళాయే..

- అప్పాజిపల్లికి బ్రహ్మోత్సవ శోభ
- నేటినుంచి ఉత్సవాలు ప్రారంభం
- మూడ్రోజులపాటు వైభవంగా..
- పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ

తిమ్మాజిపేట, జనవరి 12 : కోరిన కోర్కెలు తీర్చే నర్సన్న(లక్ష్మీనర్సింహస్వామి) ఉత్సవాలు సంక్రాంతిని పురస్కరించుకొని ఈనెల 13 నుంచి అప్పాజిపల్లిలో ప్రారంభం కానున్నాయి. ఐదు గ్రామాల ప్రజల ఇలవేల్పు అయిన స్వామి వారి బ్రహ్మోత్సవాలు మూడు రోజులుపాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. స్వామివారి అనుగ్రహం లేనిదే తమకు ఏదీ కలిసిరాదన్నది ఇక్కడి ప్రజల విశ్వాసం. ఏ కార్యం తలపెట్టిన ముందుగా స్వామిని దర్శించుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. అందులో భాగంగానే ప్రతి యేటా సంక్రాంతి సందర్భంగా ఉత్సవాలు నిర్వహించడం ఇక్కడి ప్రజల ఆనవాయితీ.

**ఆలయ చరిత్ర..**

తిమ్మాజిపేట మండలంలోని అప్పాజిపల్లి నర్సన్నగుట్టపై లక్ష్మీనర్సింహస్వామి స్వయంభూగా అవతిరించినట్లు చరిత్ర చెబుతున్నది. హిరణ్యకశ్యపుడి సంహారం అనంతరం స్వామి గుట్టపై సేదదీరాడన్నది ప్రచారంలో ఉన్న చరిత్ర. సుమారు వంద సంవత్సరాల కిందట గుట్టపై నర్సింహస్వామి ఉన్నట్లు ఈ ప్రాంతవాసులు గుర్తించారు. భారీ రాతి గుహలో ఉన్న స్వామిని మొదట దర్శించడానికి పాకుతూ వెళ్లాల్సి వచ్చేది. క్రమంగా ప్రజలు రాతిని తొలిచి, గర్భగుడిలోకి భక్తులు వెళ్లి పూజలు నిర్వహించేలాఏరా ్వట్లు చేశారు.

**ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణం..**

నర్సన్నగుట్టపై లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని దాతలు, ప్రభుత్వ సహకారంతో గ్రామస్తులు అభివృద్ధి చేశారు. గతంలో కొండపైకి నడిచి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం భారీ వాహనాలతో సహా అన్ని వాహనాలు కొండపైకి వెళ్లేందుకు రోడ్డును ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో భాగంగా మొక్కలను నాటి ఆహ్లాదకరంగా మార్చారు. గుట్టపై వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ సదుపాయంతోపాటు విద్యుత్, భక్తులకు తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించారు. తెలంగాణ దేవాదాయశాఖ నుంచి సుమారు రూ. 68లక్షలు మంజూరు కావడంతో ఆలయాన్ని పూర్తి స్థాయిలో పునర్నిర్మాణం చేపట్టారు. గుట్టపై ప్రధాన ఆలయంతోపాటు, ఆంజనేయస్వామి, మహాలక్ష్మీ, ఆండాల్ అమ్మవార్ల ఆలయాలు కూడా నిర్మించారు. భక్తుల కోసం దాతల సహకారంతో వంటశాల, అతిథి గృహాలతోపాటు ఇటీవల గుట్టపైకి రెండో దారిని కూడా ఏర్పాటు చేశారు. కరోనా అనంతరం ఇక్కడ వివాహాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు పెద్ద సంఖ్యలో నిర్వహిస్తున్నారు. స్వామివారిపై భక్తులు అచంచలమైన విశ్వాసంతో ఇక్కడ ప్రతి శనివారం, పర్వదినాలలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

**ఉత్సవాల వివరాలు**

సంక్రాంతి సందర్భంగా మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈనెల 13న (శనివారం) అంకురార్పణ, సుదర్శన హోమం, సాయంత్రం పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 14న (ఆదివారం) స్వామి వారి కల్యాణం, సత్యనారాయణ వ్రతాలు, అన్నదానం, రాత్రికి తేరు, 15న సామూహిక సత్యనారాయణ వ్రతాలు, జాతర, చుట్టపక్కల గ్రామాల నుంచి వచ్చే బండ్లు గుట్ట చుట్టూ తిప్పుతారు. అనంతరం ఉద్దాల కార్యక్రమంతోపాటు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానుండడంతో ఆలయ అధికారులు, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్నగద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

# గద్వాలను అగ్రగామిగా నిలుపుతాం

- ప్రభుత్వాలు మారినా అభివృద్ధి ఆగదు
- త్వరలో సీఎంతో 300 పడకల దవాఖాన, మెడికల్ కళాశాల ప్రారంభం
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, జనవరి 12 : గద్వాల నియోజకవర్గ ప్రజలు నాపై నమ్మకం ఉంచి రెండో సారి ఎమ్మెల్యేగా గెలిపించారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గద్వాలను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మారిందని అభివృద్ధి జరగదని చాలా పుకార్లు వినిపిస్తున్నాయని అలాంటి వదంతులు ఎవరూ నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వాలు మారినా అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గద్వాలకు మెడికల్ కళాశాల మంజూరు చేసిందని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వం మెడికల్ కళాశాలకు ప్రిన్సిపాల్‌ను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా గత, ప్రస్తుత ముఖ్యమంత్రికి గద్వాల ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. గద్వాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న నవకల్యాణిని నియమించడంపై ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 300 పడకల దవాఖాన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని మార్చిలో దానిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు త్వరలో మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. మెడికల్ కళాశాల అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.183 కోట్ల నిధులను కేటాయించిందని, దీంతో పాటు 300వందల పడకల దవాఖాన భవన నిర్మాణం కోసం కూడా రూ.49కోట్లు విడుదల చేయగా ప్రస్తుతం పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. అదేవిధంగా గద్వాలలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేసుకోవడంతో ప్రస్తుతం మూడో అకాడమీ తరగతులు కొనసాగుతున్నాయన్నారు. నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని దానిని త్వరలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామన్నారు. గతంలో ఈ ప్రాంతంలో సరైనా వైద్య సదుపాయాలు లేక పోవడంతో అత్యవసర వైద్యం కోసం కర్నూల్ లేదా హైదరాబాద్‌కు వెళ్లేవారమని, జిల్లాలో ఇక ఆ పరిస్థితి ఉండదన్నారు. ప్రస్తుతం 180 పడకలు ఉన్న దవాఖాన 300 పడకలుగా అప్‌గ్రేడ్ చేయడం జరిగిందని, వీటికి అదనంగా మరో 500పడకలు వచ్చే అవకాశం ఉందన్నారు. గద్వాల నియోజకవర్గ సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. సమావేశంలో ఎంపీపీలు ప్రతాప్‌గౌడ్, విజయ్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బాబర్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, కౌన్సిలర్ నరహరి గౌడ్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మధుసూదన్ రెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్‌లో
# ఆత్మకూరుకు మొదటి ర్యాంకు

ఆత్మకూరు, జనవరి 12 : కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను శుక్రవారం ప్రకటించింది. జిల్లాలోనే ఆత్మకూరు మున్సిపాలిటీ మొదటి ర్యాంకు సాధించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాయిత్రీయాదవ్ పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ప్రకటించిన ఈ ర్యాంకుల్లో సౌత్‌జోన్‌లో ఆత్మకూరు మున్సిపాలిటీ 43వ ర్యాంకు సాధించిందన్నారు. కమిషనర్ నాగరాజు, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది సహకారంతోనే ఈ ర్యాంకు సాధించగలిగినట్లు ఆమె చెప్పారు. ఇప్పటికే ఓడీఎఫ్‌లో అవార్డు సాధించి, ఇప్పుడు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి ర్యాంకు సాధించడం హర్షణీయమని వైస్ చైర్మన్‌విజ యభాస్కర్‌రెడ్డి అన్నారు.

**అయిజకు జాతీయ స్థాయి అవార్డు**

అయిజ, జనవరి 12 : స్వచ్ఛ సర్వేక్షణ్ –2023–24 పోటీల్లో అయిజ బల్దియా మెరిసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అయిజ మున్సిపాలిటీకి జాతీయస్థాయిలో అవార్డు కైవసం చేసుకొని సత్తా చాటింది. అయిజ మున్సిపాలిటీ 2022–23 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఫాస్టెస్ట్ మున్సిపాలిటీగా గుర్తింపు పొందింది. 2023–24 ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశంలోని 3,970 మున్సిపాలిటీలతో పోటీ పడి 4.982 మార్కులతో 713వ ర్యాంక్ సాధించింది. జోనల్ స్థాయిలో 326 మున్సిపాలిటీలతో పోటీ పడి 17వ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 44 మున్సిపాలిటీలకు 32వ ర్యాంక్ సాధించింది. ఇంటింటా చెత్త సేకరణ, చెత్తను వేరు చేయడం, వర్మీ కంపోస్టు, పబ్లిక్ టాయిలెట్స్, క్లీనింగ్ తదితర అంశాల్లో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మున్సిపాలిటీలకు మార్కులు కేటాయించినట్లు మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ తెలిపారు. జాతీయ స్థాయి అవార్డు రావడంపై మున్సిపల్ చైర్మన్ దేవన్నతోపాటు కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

# గ్రామాలాభివృద్ధికి కృషి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి



జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ఇటిక్యాల జనవరి 12 : గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఉదండాపూర్, శనిగపల్లి గ్రామ పంచాయతీ భవనాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ స్నేహ, జెడ్పీటీసీ హన్మంతురెడ్డి, సర్పంచులు అయ్యమ్మ, పావని, గోవర్ధన్‌రెడ్డి, మల్లన్న, రవీందర్‌రెడ్డి, పీఏసీసీఎస్ అధ్యక్షుడు రంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాందేవ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సుందర్‌లక్ష్మీనారాయణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

**పనులు ఆపింది నిజమే..**

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో గతేడాది చివర్లో చేపట్టిన పనులన్నింటినీ నిలిపివేసిన మాట నిజమే. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పనులు నిలిపివేశాం. కాంట్రాక్టర్లు కూడా పనులు చేయకుండా వెళ్లిపోతున్నారు. కొన్ని పనులు ప్రారంభించినా మిగతా పనులు ఆగిపోయాయి.. ఎమ్మెల్యే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేపట్టాలా వద్దా అనే దానిపై నిర్ణయం తీసుకుంటాం.

–ప్రదీప్, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

**పైనుంచి ఆదేశాలున్నాయి**

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో టీఎఫ్‌యూఐడీసీ కింద సుమారు రూ.45 కోట్ల పనులు నడుస్తున్నాయి. ఇందులో రూ.12 కోట్ల డ్రైనేజీలు, మిగతా సీసీ రోడ్లు, కమ్యూనిటీ హెల్త్ భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందులో రూ.15 కోట్ల వరకు టెండరింగ్ పూర్తయినా పనులు ప్రారంభం కాలేదు. మరో రూ.24 కోట్లకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పనులు నిలిపివేశాం.

– విజయభాస్కర్‌రెడ్డి, ఈఈ, పబ్లిక్&హెల్త్

**అభివృద్ధిని అడ్డుకోవడం దారుణం**

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకొని జిల్లా కేంద్రం రూపురేఖలే మార్చివేసి మున్సిపాలిటీని కార్పొరేషన్ స్థాయిలో తీసుకువెళ్లాలని ప్రయత్నిస్తున్న తరుణంలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని పనులన్నీ ఆపడం దారుణం. ఎమ్మెల్యే కొంతమంది కౌన్సిలర్లు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి కాంట్రాక్టర్లను బెదిరించి పనులన్నీ ఆపివేశారు.

– కేసీ నర్సింహులు, మున్సిపల్ చైర్మన్, మహబూబ్‌నగర్

**నిధుల్లేకే ఆగిపోయాయి**

పాలమూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ఆగిపోయాయని చేస్తున్న ప్రచారం అబద్ధం. కాంగ్రెస్ వాళ్లు ఆపినారని చెప్పడం మరీ దారుణం. చాలా చోట్ల పనులు నడుస్తున్నాయి, కొంతమంది కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. మా ఎమ్మెల్యే ఫండ్స్ కోసం ప్రయత్నిస్తున్నారు, అవి రాగానే చేపడుతాం. వార్డుల్లో పనులు చేస్తేనే కదా కౌన్సిలర్లకు పేరు వస్తది, కావాలని బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారు.

– ఆనంద్‌గౌడ్, కాంగ్రెస్ నేత

# పనులు ప్రశ్నార్థకం?

## పాలమూరులో ప్రగతికి బ్రేక్



మహబూబ్‌నగర్ ఆర్అండ్‌బీ వద్ద ఆగిపోయిన మార్కెట్ పనులు

- మున్సిపాలిటీలో స్పెషల్ డెవలప్‌మెంట్, టీయూఎఫ్ఐడీసీ నిధులకు రాజకీయ గ్రహణం
- రూ.150 కోట్ల పనులపై సందిగ్ధం
- ఎమ్మెల్యే ఆదేశాలతో నిలిచిన పనులు
- చేయబోమని చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిపివేశామంటున్న అధికారులు
- అభివృద్ధిని అడ్డుకునే కుట్ర : మున్సిపల్ చైర్మన్
- పనులు ఆపించామనేది అబద్ధం : కాంగ్రెస్ నేతలు
- లీడర్ల మధ్య నలిగిపోతున్న అధికారులు



మున్సిపాలిటీలో నిలిచిపోయిన సీసీ రోడ్డు పనులు

మహబూబ్‌నగర్, జనవరి 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాలమూరు అభివృద్ధి పనులకు రాజకీయ గ్రహణం పట్టుకున్నది. దీంతో మున్సిపాలిటీలో గతేడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు మొదలైన అభివృద్ధి పనులన్నీ ప్రభుత్వం మారడంతో ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అధికార పార్టీ నేతలు చెప్పినందుకే ఆగిపోయాయని స్వయంగా అధికారులు చెబుతున్నారు. తిరిగి ఆదేశాలు ఇచ్చే వరకు చేయొద్దని స్థానిక ఎమ్మెల్యే హుకుం జారీ చేసినట్లు చర్చ జరుగుతున్నది. కావాలని పనులను అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ విమర్శలు సంధిస్తోంది. మరోవైపు కాంగ్రెస్ నేతలు దీన్ని తిప్పికొడుతున్నారు. రెండు రాజకీయ పార్టీల మధ్య రాజకీయ వివాదంతో పనులన్నీ ఆపడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**రూ.150 కోట్ల పనులకు పంగనామం**

మహబూబ్‌నగర్‌లో శాశ్వత వరద నివారణ చర్యల్లో భాగంగా విడుదలైన రూ.వందకోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులకు, తెలంగాణ పట్టణ ఆర్థిక వనరుల మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులు మరో రూ.45 కోట్ల పనులన్నీ ఆగిపోవడంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇలా సుమారు రూ.150 కోట్లకుపైగా పనులకు గ్రహణం పట్టడంతో బల్దియాలో ఎక్కడికక్కడే వర్క్స్ అంతా నిలిచిపోయాయి. ఈ పనులన్నీ నిలిపివేసినట్లు మున్సిపల్ కమిషనర్ చెబుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే టెండర్ ముగిసి ప్రారంభించని పనులను మాత్రమే నిలిపివేశామని పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అంటున్నారు. కాగా దీనికి విరుద్ధంగా పను లు ఆగిపోవడంతో కాంట్రాక్టర్లు అంతా గగ్గోలు పెడుతున్నారు. పనులు చేయలేమని చేతులెత్తేస్తున్నారు. అభివృద్ధి ఆగిపోయిందని ప్రచారం జోరందుకున్నది. దీనికి కారణం కాంగ్రెస్ అని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తుండగా.. మేమేమి ఆపలేదని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీలో అధికారం చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ తహతహలాడుతున్నది. అవిశ్వాస తీర్మానంపై 27న ప్రత్యేక మున్సిపల్ సమావేశం జరగనుండడంతో రాజకీయ వేడి రాజుకున్నది.

**ఒత్తిడి మేరకే నిలుపుదల**

మహబూబ్‌నగర్‌లో కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక రూ.వందల కోట్ల నిధులతో నాటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకొని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీ గ్రేడ్లు కూడా పెంచి భవిష్యత్‌లో కార్పొరేషన్ దిశగా అడుగులు వేయించారు. దీంతో ఇక్కడ జరిగిన పనులతో పట్టణ రూపురేఖలే మారిపోయాయి. ప్రగతి పనులు సాఫీగా జరుగుతున్న తరుణంలో అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పుతో అంతా రివర్స్ అయింది. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో మున్సిపాలిటీలో చేపట్టిన కార్యక్రమాలు ప్రశ్నార్థకంగా మారాయి. ఈలోపు కొందరు అధికార పార్టీ నాయకులు కమిషనర్ ఇతర ఇంజినీర్లపై ఒత్తిడి తీసుకొచ్చి మా ప్రమేయం లేకుండా పనులు చేయొద్దని, వెంటనే నిలిపివేయాలని ఎమ్మెల్యేతో ఒత్తిడి చేయించినట్లు సమాచారం. దీంతో మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఎస్డీఎఫ్, టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన పనులు ఆగిపోయాయి..

**పనులు చేయబోమంటున్న కాంట్రాక్టర్లు**


2022లో వచ్చిన వరదలతో మున్సిపాలిటీలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణం విస్తరిస్తున్నా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వరద ఉప్పొంగి ఎక్కడికక్కడే పట్టణాన్ని ముంచెత్తింది. దీంతో నాటి ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకొని రూ.100 కోట్లు వరద నివారణ చర్యలకు మంజూరు చేయించారు. ఈ నిధులతో శాశ్వతంగా వరద నివారణ చర్యలు చేపట్టారు. కాల్వల నిర్మాణం, లోతట్టు ప్రాంతాల్లో కొట్టుకుపోయిన రహదారుల ఏర్పాటుతోపాటు అనేక కార్యక్రమాలు చేపట్టారు. దీనికితోడు మరో రూ.50 కోట్ల నిధులు జతచేసి అన్ని కాలనీలో సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలు వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు . టెండర్లు ఆహ్వానించి పనులు కూడా ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల సమయం రావడంతో అన్ని పనులకు శంకుస్థాపనలు చేసి కోడ్ ముగిశాక పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు వర్క్ అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. దీంతో ఎన్నికల ఫలితాలు తారుమారు కావడంతో ప్రభుత్వమే మారిపోయింది. అధికార పార్టీ నాయకులు ఈ పనులన్నింటినీ తాము చెప్పే వరకు ప్రారంభించొద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిసింది.

**మున్సిపాలిటీపై పట్టుకుయత్నం**

అధికార పార్టీ నాయకులు మహబూబ్‌నగర్ మున్సిపాలిటీపై పట్టుకోసం ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రం డెవలప్‌మెంట్‌కు సంబంధించిన కార్యక్రమాలు తాము చెప్పినప్పుడే ప్రారంభించాలని, మళ్లీ కొత్తగా శంకుస్థాపనలు చేసేందుకు ప్లాన్లు వేస్తున్నారని తెలిసింది. కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరై టెండర్లు పూర్తయ్యి పనులు ప్రారంభమయ్యాక సగంలోనే కొన్ని ఆపడం, ప్రారంభం కాని పనులను కూడా ఆపమని హుకుం జారీ చేయడం ఎంతవరకు సమంజసమని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. కాగా మున్సిపాలిటీపై పూర్తిస్థాయిలో పట్టు సాధించేందుకు కొందరు కౌన్సిలర్లను ఎరగా వాడుకొని అధికారాన్ని చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా దీన్ని విఫలం చేసేందుకు బీఆర్ఎస్ పావులు కదుపుతున్నది.

# దళితబంధు నిధులు విడుదల చేయాలి

- హన్వాడ ఎంపీడీవో కార్యాలయం ఎదుట లబ్ధిదారుల నిరసన



హన్వాడ ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన దళితబంధు లబ్ధిదారులు

హన్వాడ, జనవరి 12 : దళితబంధుకు ఎంపికైన లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం హన్వాడ మండలంలో 1,100 మందిని దళితబంధు పథకానికి ఎంపిక చేసి వారితో బ్యాంక్ అకౌంట్లు తెరిపించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయించిందన్నారు. అప్పుడే ఎన్నికల కోడ్ రావడంతో దళితబంధు సాయం నిలిచి పోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిధులను గ్రౌండింగ్ చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలరోజులు గడిచినా దళిత బంధుపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో లబ్ధి దారులు ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే లబ్ధిదారులకు రూ.10 లక్షలు సాయం అందించాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. త్వరలోనే జిల్లా కేంద్రం లో లబ్ధిదారులతో కలిసి ఆమరణదీక్షలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఈవోపీఆర్డీకి లబ్ధిదారులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఆనంద్, బాలకిష్టయ్య, డబ్బరాములు, వెంకటయ్య, యాదయ్య, శ్రీనివాసులు, మొగులయ్య లబ్ధిదారులు పాల్గొన్నారు.




ట్రోఫీ అందుకుంటున్న ఉమెన్స్ ఫాస్ట్–5 కేరళ జట్టు

# జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

- క్రీడల్లో గెలుపోటములు సహజం
- సౌత్‌జోన్ నెట్‌బాల్ చైర్మన్ గిరీష్ సీ గౌడ
- ముగిసిన నెట్‌బాల్ పోటీలు

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 12 : క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తిని చాటాలని సౌత్‌జోన్ నెట్‌బాల్ చైర్మన్ గిరీష్ సీ గౌడ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో సౌత్‌జోన్ ఫాస్ట్–5, మహిళ, పురుషుల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీలో విజేతలకు ఆయన ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో నెట్‌బాల్‌లో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణిస్తున్నారన్నారు. క్రీడాకారులకు క్రీడా కోటలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. రేపటి నుంచి జరిగే జాతీయస్థాయి టోర్నీలో ఆయా జట్ల క్రీడాకారులు ప్రతిభ చాటాలని సూచించారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆదిత్యరెడ్డి, ఖాజాఖాన్, ఉపాధ్యక్షుడు సాదత్‌ఖాన్, ట్రెజరర్ సోహెల్, రామ్మోహన్, రఘు, అంజద్, షకీల్, అక్రమ్ పాల్గొన్నారు.

**ముగిసినపో టీలు..**

సౌత్‌జోన్ ఫాస్ట్–5 మహిళ, పురుషుల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ ముగిసింది. పురుషుల(ట్రెడిషనల్) ఫైనల్ మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 12–04తో కర్ణాటకపై గెలిచి చాంపియన్‌గా నిలిచింది. మహిళల విభాగంలో కర్ణాటక జట్టు 20–18తో కేరళపై గెలిచి చాంపియన్‌గా నిలిచింది. కర్ణాటక, కేరళ జట్లు రన్నర్‌గా నిలిచాయి. తెలంగాణ మహిళ జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఫాస్ట్–5 పురుషుల ఫైనల్ మ్యాచ్‌లో కర్ణాటక జట్టు 20–09తో కేరళపై చాంపియన్ నిలువగా, మహిళా విభాగంలో కేరళ జట్టు 26–22తో కర్ణాటకపై గెలిచింది. రన్నర్‌గా పురుషుల విభాగంలో కేరళ, మహిళా విభాగంలో కర్ణాటక నిలిచాయి. పురుషులు, మహిళా విభాగంలో తెలంగాణ, పుదుచ్చేరి జట్టు మూడోస్థానంలో నిలిచాయి.

# పాలమూరులో క్రీడా సంబురం

- నేటినుంచి 2వ ఫెస్ట్ 5 సీనియర్ నేషనల్ నెట్‌బాల్ చాంపియన్ షిప్
- పాల్గొననున్న 28రాష్ట్రాలు, 720 మంది క్రీడాకారులు
- టోర్నీని ప్రారంభించనున్న ఎమ్మెల్యే
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 12 : జిల్లా కేంద్రం జాతీయస్థాయి క్రీడా సంబురానికి వేదికకానుంది. నేటి నుంచి మహబూబ్‌నగర్ క్రీడా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 16వ తేదీ వరకు 2వ ఫెస్ట్ 5 సీనియర్ నేషనల్ మహిళా, పురుషుల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ జరగనున్నది. దాదాపు నాలుగేండ్ల తరువాత జాతీ య క్రీడలు జరుగుతున్నాయి. నాలుగు రోజుల పాటు పట్టణ ప్రజలను కనువిందు చేయనున్నాయి. జిల్లా నెట్‌బాల్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదిత్యరెడ్డి, ఖాజాఖాన్ ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహణకు ఏర్పాటు చేశారు. మహిళా క్రీడాకారులకు ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్, పురుషులకు చైతన్య స్కూల్, లిటిల్‌స్కాలర్స్ స్కూల్‌లో బస కల్పిస్తున్నారు. బీపీహెచ్ఎస్‌లో భోజన వసతి కల్పిస్తున్నారు.

**పాల్గొననున్న 28 రాష్ట్రాల జట్లు..**

2వ ఫెస్ట్ 5 సీనియర్ నేషనల్ మహిళా, పురుషుల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి 720 మంది క్రీడాకారులు తలపడనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, బీహర్, చత్తీస్‌గఢ్, చండీఘడ్, ఢిల్లీ, గోవా, గుజరాత్, హర్యానా, హిమచల్‌ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహరాష్ట్ర, మణిపూర్, నాగలాండ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్ జట్లు పాల్గొనున్నాయి. నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను శనివారం సాయంత్రం 4గంటలకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. నెట్‌బాల్ డెవలప్‌మెంట్ కమిటీ ఇండియా చైర్మన్ హరిఓం ప్రకాశ్‌కౌశిక్, నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ విజేందర్‌సింగ్, రాష్ట్ర ప్రతినిధులు, జిల్లా ప్రతినిధులు ప్రముఖులు హాజరుకానున్నారు.

**జట్టు వివరాలు..**

తెలంగాణ ఫెస్ట్ 5 పురుషుల జట్టు : విక్రమాదిత్య రెడ్డి, ఇస్మాయిల్, హరీశ్, శ్రావణ్, ప్రకాశ్, సాయికృష్ణ, అంజయ్య, విహరి, అభిసాయి, సాయిప్రణీత్.

మహిళా జట్టు : మౌనిక, సమిత, అకిల, గౌతమి, మేఘన, నవ్యతేజశ్రీ, శిజాని, అనన్య, అలోన, వైష్ణవి జట్టులో ఉన్నారు.



మహబూబ్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియం